
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 19 । మార్చి । 2023



ఖమ్మం చేరిన 'భారత్ గౌరవ్' రైలు

ఐఆర్‌టీసీ ద్వారా పురాతన, పుణ్యక్షేత్రాల సందర్శనకు ఏర్పాటుచేసిన ప్రత్యేక రైలు ఖమ్మం స్టేషన్‌కు చేరుకోగా స్వాగతం పలికారు. 10లో



వనరుల సేకరణకు ప్రాధాన్యత

డీసీసీబీ, పీఏసీఎస్‌ల బలోపేతానికి గాను వనరుల సేకరణపై దృష్టి సారించాలని డీసీసీబీ చైర్మన్ నాగభూషణం సూచించారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం చల్లగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

ఆత్మీయంగా గులాబీలు!



- సీఎం సూచనలతో నియోజకవర్గాల్లో భేటీలు
- నేడు ఖమ్మంలో మంత్రి పువ్వాడ ఆధ్వర్యాన తొలి సమావేశం
- మిగతా నియోజకవర్గాల్లోనూ నిర్వహణకు ఎమ్మెల్యేల కసరత్తు
- కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకొచ్చేలా ప్రణాళిక

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ నేతలు నిత్యం ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తూనే.. పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుడుతున్నారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ వారం ఈ సమావేశాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధంకాగా.. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం వన్‌టౌన్ కేడర్‌తో ఆదివారం తొలి సమావేశం నిర్వహణకు నిర్ణయించారు. ఇలా ప్రతీ వారం కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అధిష్టానం చేసిన సూచనలతో ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

శ్రేణుల సన్నద్ధం దిశగా..

బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చేలా శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని అధిష్టానం నిర్ణయించింది. నాయకులు, కార్యకర్తల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశమని నాయకులు చెబుతున్నారు. ఆత్మీయ సమ్మేళనాల్లో కార్యకర్తల సమస్యలు, పార్టీ మరింత బలపడడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకుషంగా చర్చించి, ఎక్కడైనా నాయకులు, కార్యకర్తల నడుమ అభిప్రాయ బేధాలు ఉంటే వాటిని పరిష్కరించనున్నారు.

పట్టు సాధించాల్సిందే..

తెలంగాణ ఏర్పడ్డాక 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లాలో కేవలం ఒక్కో అసెంబ్లీ స్థానంతోనే సరిపెట్టుకుంది. అయితే వచ్చే ఎన్నికల్లో మాత్రం పట్టు సాధించాలన్న వ్యూహంతో ముందస్తుగా సన్నద్ధమవుతోంది. బీఆర్‌ఎస్ తొలి ఆవిర్భావ సభ కూడా ఇక్కడే నిర్వహించడంతో పార్టీ అధిష్టానం కూడా ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. ఈక్రమంలోనే నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలు గ్రామ, మండల, పట్టణ స్థాయిలో ఉండే నేతల మధ్య దూరాన్ని తగ్గిస్తాయని, ఎన్నికల నాటికి అంతా కలిసిపోతారని భావిస్తోంది. కాగా, సమ్మేళనాల పర్యవేక్షణకు ఖమ్మం జిల్లాకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఎమ్మెల్సీ భానుప్రసాద్‌ను పార్టీ అధిష్టానం ఇన్‌చార్జిలుగా నియమించింది.

ఖమ్మం నుంచి షురూ

జిల్లాలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు ఖమ్మం నియోజకవర్గం నుంచే ప్రారంభం కానున్నాయి. ఆదివారం జరిగే ఖమ్మం వన్‌టౌన్ ప్రాంత సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొననుండగా.. తప్పక హాజరుకావాలని కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, భవిష్యత్‌లో చేయనున్న పనులను వివరించడమే కాక కేడర్‌కు సంబంధించి సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ సమావేశం పూర్తయ్యాక వారానికొకటి చొప్పున టూటౌన్, త్రీటౌన్, ఖానాపురం హవేలి, రఘునాథపాలెం మండలాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. ఇక సత్తుపల్లి, వైరా, మధిర, పాలేరు నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమావేశాల నిర్వహణకు అక్కడి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కసరత్తు మొదలుపెట్టారు. ఖమ్మం మినహా మిగతా నియోజకవర్గాల్లో మండలానికి రెండు చొప్పున ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ అధిష్టానం ఆదేశించిన నేపథ్యాన విజయవంతానికి పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

నేత్రనిధి.. ఆపన్నుల పెన్నిధి



- ఖమ్మం కేంద్రంగా 23ఏళ్ల నుంచి సంస్థ కార్యకలాపాలు
- ఇప్పటివరకు వేలాది మందికి కంటి చూపు
- ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానంతో మరింత సేవ

సండే స్పెషల్

ఖమ్మం వైద్యవిభాగం: మనిషి అవయవాల్లో ఒక్కో దానికి ఒక్కో ప్రాముఖ్యత. అందులో అత్యంత ప్రధానమైనవి నేత్రాలు మాత్రమే. కంటి చూపు కోల్పోతే అందమైన లోకాన్ని చూసే అవకాశాన్ని కోల్పోతారు. అలాంటి అభాగ్యులు ఎందరో మన ముందు కనిపిస్తారు. అయితే, కంటి చూపు లేని వారికి, వివిధ కారణాలతో చూపు కోల్పోయిన వారికి ఖమ్మం నేత్రనిధి దారి చూపిస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా మరణించిన వారి నుండి నేత్రాల(కార్నియా)ను సేకరిస్తూ వేలాది మందికి చూపు ప్రసాదిస్తున్న ఈ సంస్థ బాధ్యులు.... ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ప్రతీరోజు 100 మందికి అన్నదానం చేస్తూ మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

23ఏళ్లుగా సేవలు

ఖమ్మం నగరానికి చెందిన రాయపుడి అనంత పద్మనాభం ఆధ్వర్యాన 2000 సంవత్సరంలో ఖమ్మం నేత్రనిధి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నిరాటంకంగా ఎందరికో కంటి చూపును ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అనతి కాలంలోనే జిల్లా వ్యాప్తంగానే కాక రాష్ట్రంలో గుర్తింపు సాధించారు. తొలుత కమాన్‌బజార్‌లో నేత్రనిధి కార్యాలయం ఉండగా.. ఖమ్మం జనరల్ ఆస్పత్రినే ప్రత్యేక భవనాన్ని అధికారులు కేటాయించారు. దీంతో నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. 'నేత్రదానం – శ్రేష్ట దానం' నినాదంతో మరణించిన వారి కుటుంబీకులను కలిసి నేత్రదానం ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. తద్వారా మరణించిన వారి నేత్రాలను సేకరించి కార్నియా అంధత్వం ఉన్న వారికి అమర్చడం ద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపుతున్నారు.

ఐదు వేల మంది నుంచి సేకరణ

కంటిచూపు కోల్పోయిన వారిలో కాంతిరేఖలు నింపుతున్న ఖమ్మం నేత్రనిధి సంస్థ ఇప్పటి వరకు 5వేల మంది నుండి 10 వేల నేత్రాలు(కార్నియా) సేకరించడం విశేషం. సహజంగా వ్యక్తులు కన్నుమూసిన ఆరు గంటల్లోగా కార్నియా సేకరించి ప్రత్యేకంగా భద్రపరుస్తారు. అయితే, కొందరు మాత్రం కళ్లు మొత్తం తొలగిస్తారనే అపోహతో నేత్రదానానికి ముందుకు రావడం లేదు. దీంతో మరణించిన వారి కుటుంబీకులను కలిసి కంటి నల్లగుడ్డుపై అడ్డంగా ఉండే పొర (కార్నియా) మాత్రమే సేకరిస్తామని అవగాహన కల్పిస్తారు. సేకరించిన కార్నియాను హైదరాబాద్‌లోని అపోలో, అగర్వాల్, ఎల్‌వీ ప్రసాద్ తదితర ఐ బ్యాంకులకు పంపించి కార్నియా అంధత్వం ఉన్న వారికి అమర్చేలా కృషి చేస్తున్నారు. దీంతో చూపు లేని ఎందరో జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. కాగా, ఎయిడ్స్, బ్లడ్ కేన్సర్, కామెర్ల వ్యాధులతో మరణించిన వారి కార్నియా మాత్రం పనికిరాదని వైద్యులు వెల్లడించారు.



మరణించిన వ్యక్తి కార్నియాను సేకరిస్తున్న వైద్యుడు



జిల్లా ఆస్పత్రిలోని ఖమ్మం నేత్రనిధి కార్యాలయం

అన్ని ప్రాంతాలకు సేవలు విస్తరించాం..



తొలుత ఖమ్మంలో నేత్రాలు సేకరించగా.. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లానే కాక మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లాల నుంచి కూడా నేత్రాలను సేకరిస్తున్నాం. సేకరించే కార్నియాను హైదరాబాద్ పంపి అంధత్వం ఉన్న వారికి చూపు దక్కేలా కృషి చేస్తున్నాం. ఖమ్మం నేత్రనిధి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందటం ఆనందంగా ఉంది. నేత్రదానంపై అపోహలను విడనాడి అందరూ ముందుకు వస్తే సమాజంలో ఎందరికో చూపు ప్రసాదించవచ్చు.

– ఆర్.అనంత పద్మనాభం,
ఖమ్మం నేత్రనిధి కార్యదర్శి

న్యూస్‌రీల్

కార్మికుల వేతనాలు విడుదల

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా పెద్దాస్పత్రిలోని కార్మికులు వేతనాల కోసం కొంత కాలంగా ఇబ్బంది పడుతుండగా, నెలనెలా సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈమేరకు శుక్రవారం వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఆందోళనకు దిగగా.. సమస్య వివరాలతో పాటు పరిష్కారంపై అధికారుల తీరుపై 'సాక్షి'లో శనివారం 'పెద్దాస్పత్రిలో జీతాల లొల్లి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో విషయం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ దృష్టికి వెళ్లగా ఆయన ఆదేశాలతో ఆస్పత్రి అధికారులు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు విడుదల చేశారు. అలాగే, తరచూ సమస్య ఏర్పడుతుండటంతో శాశ్వత పరిష్కారానికి పూనుకున్నారు. అదనపు కలెక్టర్ స్నేహలత శనివారం ఆస్పత్రి అధికారులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. ఈమేరకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని గుర్తించి ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేయించారు.

మెడికల్ కళాశాలకు ఎనిమిది మంది ప్రొఫెసర్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తరగతుల ప్రారంభానికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే భవనాల కేటాయింపు పూర్తి కాగా ఆధునికీకరణ పనులు చేపట్టారు. మరోపక్క శనివారం ఎనిమిది మంది ప్రొఫెసర్లను కేటాయించడంతో వారు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావుకు రిపోర్టు చేశారు. గతంలో 24 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులను కేటాయించగా, సూపరింటెండెంట్‌ను కూడా త్వరలో నియమించే అవకాశం ఉంది. కాగా, మెడికల్ కళాశాల భవనాల ఆధునికీకరణ పనులు వచ్చే నెలలోగా పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి వారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేశాక, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఏపీ, తెలంగాణ నుంచి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం, పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను రికవరీ చేయాలి



తల్లాడ : అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

ఖమ్మంమయూరిసెంటర్/తల్లాడ: జిల్లాలో స్త్రీనిధి రుణాలు వంద శాతం రికవరీ చేయాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన సూచించారు. పెనుబల్లి, వేంసూరు ఏపీఎంలు, సీసీలు, వీఓఏలతో శనివారం జిల్లా కేంద్రంలో సమీక్షించిన ఆమె మాట్లాడుతూ రుణాల వసూళ్లపై సూచనలు చేశారు. పెనుబల్లిలో 18 గ్రామసంఘాల నుంచి రూ.1.10 కోట్లు, వేంసూరులో 28 గ్రామసంఘాల నుంచి రూ.1.48కోట్లను ఈ నెల 25లోగా వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్త్రీనిధి ఆర్‌ఎం రవీందర్ నాయక్, డీపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తల్లాడ మండలంలోని అంబేద్కర్ నగర్, మల్సూర్‌తండా గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ డీఆర్‌డీఓ విద్యాచందన పరిశీలించి మొక్కల సంరక్షణపై సూచనలు చేశారు. ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఏపీఓలు కోటయ్య, సుజాత పాల్గొన్నారు.

'పాలేరు'కు మళ్లీ జలకళ!

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం శనివారం 21 అడుగులకు చేరింది. రిజర్వాయర్‌కు సాగర్ నుండి 4,886 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఇదేసమయాన వర్షాలు పడుతుండడంతో ఎడమ కాల్వకు నీటి సరఫరాను 470 క్యూసెక్కులకు తగ్గించి, పాలేరు కాల్వకు పూర్తిగా నిలిపివేశారు. దీంతో పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం మరింత పెరిగి ఆదివారం పూర్తిస్థాయిలో 23 అడుగులకు చేరుతుందని భావిస్తున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండనుండగా జిల్లాలోని ఆయకట్టుకు ఇబ్బందులు తీరనున్నాయి.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



ఆటోకు అవగాహన పోస్టర్ అంటిస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే త్వరగా కేసులు పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మం కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన బ్యాంక్ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ప్రతీ మూడు నెలల కోసారి నిర్వహించే లోక్ అదాలత్‌లో ఈసారి బ్యాంకు సంబంధిత కేసులను విచారించినట్లు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా మాట్లాడుతూ రుణ గ్రహీతలకు వడ్డీ పూర్తిగా మాఫీ చేయడమే కాక రుణం తగ్గిస్తున్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులను అభినందించారు. ఈసందర్భంగా రూ.6 లక్షలకు సంబంధించి 130 ప్రీ లిటిగేషన్లను పరిష్కరించారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ, వరకట్నం, భ్రూణ హత్యల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను జిల్లా జడ్జి ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో న్యాయమూర్తులు ఆర్. దానీరూత్, ఎస్.అమరావతి, ఎస్.శాంతిసోని, పి.మౌనిక, ఆర్.శాంతిలత, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గొల్లపూడి రామారావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం పార్థసారథి మురళి తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

కూసుమంచి: కష్టపడి చదవాలనే కోరిక ఉంటే పేదరికం అడ్డు కాబోదని జిల్లా జడ్జి టి.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యాన కూసుమంచిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ మహిమూదా, హెచ్‌ఎం రేలా విక్రంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'భరోసా'తో బాధిత మహిళల్లో మనోధైర్యం



కేక్ కట్ చేస్తున్న సీపీ వారియర్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: న్యాయం కోసం వచ్చిన బాధిత మహిళలకు అండగా నిలుస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపడానికి భరోసా కేంద్రం సాయపడుతోందని సీపీ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. జిల్లా ఆస్పత్రిలోని భరోసా సెంటర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆయన కట్ చేసి మాట్లాడారు. హింసకు గురైన మహిళ ఎక్కడకు వెళ్లాల్సిన పని లేకుండా భరోసా సెంటర్‌లోనే కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పోలీసు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 95మంది ఆశ్రయించగా అండగా నిలిచామని, ఇందులో 11మందికి రూ.55వేల సాయం అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు గణేష్, రామోజీ రమేష్, సీఐ అంజలి, సెంటర్ బాధ్యులు సంధ్యారాణి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

18,906 ఎకరాల్లో మొక్కజొన్న నష్టం

- రెండో రోజూ కొనసాగిన వర్షం
- ఆందోళనలో జిల్లా రైతాంగం

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాల కారణంగా జిల్లాలో మొక్కజొన్న పంటకు జరిగిన నష్టంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. శుక్రవారం నాటికి జిల్లాలో 9,130 రైతులకు చెందిన 18,826 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతినగా, శనివారం కూడా వర్షం కొనసాగింది. ఈ వర్షంతో ఖమ్మం అర్బన్ మండలం అల్లీపురం, కొత్తగూడెం గ్రామాల్లో 80 మంది రైతులకు చెందిన 60 ఎకరాల్లో, కామేపల్లి మండలం జాస్తిపల్లిలో 8మంది రైతులకు చెందిన 20 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. మొత్తంగా ఇప్పటి వరకు 9,218 మంది రైతులకు చెందిన 18,906 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. కాగా, శనివారం కూడా వర్షం కురవడం, ఇంకా రెండు, మూడు రోజులు వర్షాల ప్రభావం ఉంటుందనే అధికారుల ప్రకటనతో మొక్కజొన్న, మిర్చి, మామిడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

8.6 మి.మీ.ల వర్షపాతం నమోదు

శనివారం ఉదయం జిల్లాలో సగటున 8.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. తల్లాడ మండలంలో 3.2, మి.మీ., కామేపల్లిలో 1.4, కల్లూరు, వేంసూరులో 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా, ఖమ్మం పరిసర మండలాలతో పాటు కూసుమంచి, సత్తుపల్లి, వైరాలోని పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడా వర్షం కురిసింది.

ప్రతిపాదనలు సమర్పించండి

- ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలి
- సీఎం ప్రత్యేక నిధులపై సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన నిధులతో చేపట్టే పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం హామీ, ప్రత్యేక అభివృద్ధి కింద జిల్లాకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మధిర మున్సిపాలిటీకి రూ.30 కోట్లు, మేజర్ గ్రామపంచాయతీలైన కల్లూరు, తల్లాడ, పెద్దతండా, ఏదులాపురం, నేలకొండపల్లికి రూ.10 కోట్ల చొప్పున విడుదలైనందున పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులతో పాటు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఓపెన్ జిమ్‌లతో కూడిన పార్కులు, ఏబీసీ కేంద్రాలు, స్వీపింగ్ యంత్రాల కొనుగోలుపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

పనుల్లో వేగం పెరగాలి

జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన న్యూఢిల్లీకి చెందిన జాతీయ రహదారుల శాఖ అధికారి అజయ్ భర్గోటితో తదితరులతో సమావేశమయ్యారు. నాగపూర్–అమరావతి జాతీయ రహదారి అలైన్‌మెంట్‌లో మార్పులతో పాటు ఖమ్మం– బోనకల్ రహదారిపై చర్చించాక, భూసేకరణ, పరిహారం చెల్లింపు పూర్తిచేయాలని తెలిపారు. ఈమేరకు జాతీయ రహదారుల అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో సంయుక్త పరిశీలన చేపడితే ఫలితం ఉంటుందని చెప్పారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, జాతీయ రహదారుల పీడీ దుర్గాప్రసాద్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, సీపీఓ శ్రీనివాస్, వివిధ శాఖల ఈఈలు శ్యాంప్రసాద్, చంద్రమౌళి, కేవీకే.శ్రీనివాస్, రంజిత్, ఆర్డీఓ రవీంద్రనాథ్, భూసేకరణ విభాగం డీటీ రంజిత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కామేపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ నారపురాజు దయామణి తన వేతనం నుంచి రూ.24వేలను ఆర్మీ నిధుల కోసం కలెక్టర్ గౌతమ్‌కు అందించగా ఆయన అభినందించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామ రెడ్డి తెలిపారు. కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, రిఫ్రిజిరేటర్, ఏసీ మెకానిక్ అంశాల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో విద్యార్హత, ఆధార్ కార్డు, ఫొటో, కుల ధ్రువీకరణ పత్రం జతపరిచిన దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 99482 07271 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల్లో త్యాగాలకు సిద్ధంగా లేము..

- వచ్చేనెల 9న వామపక్షాల సంయుక్త సభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల్లో మతోన్మాద శక్తులను ఓడించేందుకు కమ్యూనిస్టులుగా ముందు నిలుస్తామే తప్ప.. 'మీరు త్యాగం చేయండి.. మేం పోటీ చేస్తాం' అని ఎవరైనా అంటే త్యాగం చేయడానికి సీపీఐ సిద్ధంగా లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వామపక్షాలు ఐక్యంగానే ఎన్నికల బరిలోకి దిగుతాయని స్పష్టం చేశారు. పార్టీల మధ్య ఐక్యతను మరింత పెంపొందించేందుకు వచ్చేనెల 9న నాయకత్వ స్థాయిలో సంయుక్త సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశానికి సీపీఐ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరితోపాటు డాక్టర్ కె.నారాయణ, బీ.వీ.రాఘవులు తదితరులు హాజరవుతారని వివరించారు. బలానికి అనుగుణంగా కలిసొచ్చే వారితో సంయుక్తంగా పోటీ చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ హఠావో.. దేశ్‌కీ బచావో నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాచైతన్య యాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. బీజేపీ పాలన దోపిడీదారులు, కార్పొరేట్ శక్తులకు స్వర్ణయుగంగా మారగా, అనేకమంది ప్రధానమంత్రులు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్మిస్తే మోదీ వాటిని అమ్ముతున్నారని ఆరోపించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర, జిల్లా నాయకులు సిద్దినేని కర్ణకుమార్, దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుండి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో బ్లూస్టార్ యూత్ ఆధ్వర్యాన ఈనెల 20నుంచి ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రూ.3వేలు చెల్లించి జట్ల వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈపోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.75వేలు, రూ.50వేలు, రూ.25వేల నగదు అందజేస్తామని తెలిపారు. వివరాల కోసం 95052 09870, 96184 57156 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వారితో డీవైఎస్‌ఓ, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో ఖమ్మంకు చెందిన ఐదుగురు క్రీడాకారులు సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వివిధ విభాగాల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన సాయిరాం, భరత్, జశ్వంత్, తేజస్విని, చంద్రశ్రీ ఈనెల 29నుంచి బెంగళూరులో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారని డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్ జునైదా తెలిపారు.

తప్పిన ప్రమాదం



రహదారిపై నిలిచిన భారీ వాహనం, బస్సు

వైరా: భారీ వాహనం డివైడర్‌పై ఉన్న శిలాఫలకాన్ని ఢీకొట్టడంతో అది బస్సుపై పడగా తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం వైపు నుంచి శనివారం వస్తున్న ఓ భారీ కంటైనర్ వాహనం వైరా మున్సిపాలిటీ కార్యాలయం సమీపాన డివైడర్‌పై ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఢీకొట్టింది. దీంతో ఇటుకలు ఎగిరి వైరా నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై పడ్డాయి. బస్సులో ఎవరూ గాయపడకున్నా, శిలాఫలకం పడి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

పెళ్లింట్లో విషాదం

డీజే పాటకు నృత్యం చేస్తూ వివాహిత మృతి



రాణి (ఫైల్)

ఖమ్మంఅర్బన్: నగరంలోని అల్లీపురంలో పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. డీజే పాటలకు బంధువులతో కలిసి నృత్యం చేస్తున్న ఓ వివాహిత మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, బంధువుల కథనం ప్రకారం.. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన పెనుగూరి రాణి(34) ఈనెల 16న అల్లీపురంలో తన మరిది వివాహానికి హాజరైంది. అదేరోజు రాత్రి నూతన జంటను రాత్రి 11 గంటలకు ఇంటికి తీసుకొచ్చే క్రమంలో డీజే పాటలకు అందరూ నృత్యం చేస్తున్నారు. ఇందులో రాణి కూడా నృత్యంచేస్తూ ఉన్నట్లుండి కిందపడడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగానే ఆమె మృతి చెందింది. లో బీపీకి తోడు డీజే శబ్దానికి మెదడులోని నరాలు చిట్టిపోయి, గుండెపోటుకు గురై ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారని బంధువులు తెలిపారు. రాణి భర్త ఉప్పలయ్య మానసిక దివ్యాంగుడు కాగా, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విషాదంలోనూ పరీక్ష రాసిన విద్యార్థి



శివాజీ

కూసుమంచి: సోదరుడు కన్నుమూయగా పుట్టెడు దుఃఖంలోనూ ఓ ఇంటర్ విద్యార్థి పరీక్ష రాశాడు. మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన దాసరి దుర్గయ్య కుమారుడు నాగయ్య(19) కొద్దిరోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు ఆయన మృతదేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకురాగా.. ఇదేరోజు నాగయ్య తమ్ముడు శివాజీ ఇంటర్ సెకండియర్ పరీక్ష రాయల్సి ఉంది. అయితే, దుఃఖంలో ఉన్న ఆయనకు పెద్దలు సర్ది చెప్పడంతో కూసుమంచిలో పరీక్ష రాసి వచ్చాక సోదరుడి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

కుక్కలను చంపిన ఘటనపై కేసు

ఖమ్మంక్రైం: వీధికుక్కలను చంపిన ఘటనపై ఖమ్మం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం రాపర్తినగర్‌లోని ముత్యాలమ్మ గుడి పెద్ద వీధి కుక్కలు మృతి చెంది ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు విషప్రయోగం చేశారనే అనుమానంతో మున్సిపల్ జవాన్ లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు..

- పేపర్ లీకేజీకి మంత్రి బాధ్యత వహించాలి
- బీజేపీ ఆధ్వర్యాన ఆందోళన, కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్ పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీకి రాష్ట్ర మంత్రి కేటీఆర్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకుని ముట్టడించారు. కలెక్టరేట్ గేటు తోసుకుని లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈక్రమంలో పలువురిని పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఘటనపై క్షమాపణ సరిపోదని, నైతిక బాధ్యతగా మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, నిరుద్యోగుల పక్షాన గళం వినిపిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయటం సిగ్గుచేటన్నారు. ఉద్యోగ పరీక్షలకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగులు పరీక్షల రద్దుతో నష్టపోయినందున వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, నున్నా రవి, రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, చంద్రశేఖర్, సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, నకిరికంటి వీరభద్రం, నూకల రామ్మోహన్‌రెడ్డి, విజయరెడ్డి, అంజయ్య, నాగేశ్వరావు, అరుణ, సుదర్శన్, వీరూగౌడ్, వెంకట్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణగుప్త, అనిత, శంకర్ గౌడ్, సాయిరాం, ఉపేందర్, బీ.పీ.నాయక్, చావా కిరణ్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పలువురిపై కేసు నమోదు

రఘునాథపాలెం: కలెక్టరేట్ వద్ద పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ వారిని తోసుకుంటూ లోనకు వెళ్లిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలువురిపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం ఎస్‌ఐ రవి తెలిపారు. కలెక్టరేట్‌ను ముట్టడించే క్రమంలో బీజేపీ శ్రేణులు తమ విధులకు ఆటంకం కలిగించారని కానిస్టేబుల్ బి.సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని చెప్పారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్



చింతకాని : నాగులవంచలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని/బోనకల్: అకాల వర్షంతో మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు, నాగులవంచ, బోనకల్ మండలం రావినూతల, గోవిందాపురం(ఎల్) గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న రైతులు పంట నష్టపోవడంతో అప్పులు తీర్చే మార్గం లేకుండా పోయిందన్నారు. ఈమేరకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్‌తో పాటు నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున్, బొర్రా ప్రసాద్, కన్నెబోయిన గోపీ, కూరపాటి కిషోర్, మడుపల్లి భాస్కర్, ఆలస్యం బస్వయ్య, పాశం సంజీవరెడ్డి, కర్నాటి రామకోటేశ్వరావు, నల్లమోతు సత్యనారాయణ, చేబ్రోలు మల్లికార్జున్‌రావు, ప్రేమ్‌కుమార్, భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇక బోనకల్ మండలంలోని పలు గ్రామాల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, నాయకులు ఉమ్మినేని రవి, కొమ్ము శ్రీనివాసరావు, కారంగుల చంద్రయ్య, లక్ష్మణ్‌రావు కూడా పంటలను పరిశీలించారు.

నియంత్రణలోనే నాటుసారా

- త్వరలోనే మధిర, నేలకొండపల్లి ఎక్సైజ్ కార్యాలయాలు ప్రారంభం
- జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏఈఎస్ వేణుగోపాలరెడ్డి, పక్కన సీఐ విజేందర్

నేలకొండపల్లి: జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకాలను పూర్తిగా నియంత్రించామని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాను గుడుంబా రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగా, జిల్లాలో ఈ ఏడాది రూ.122 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు సాగాయని, గత ఏడాదితో పోలిస్తే 18వేల కేసులు అదనంగా అమ్ముడయ్యాయని చెప్పారు. వైన్స్ యజమానులు పన్ను వాయిదాను ఈనెల 20 లోపు చెల్లించాలని సూచించారు. ఇక ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా వల్లభి, బోనకల్ చెక్‌పోస్టుల వద్ద నిఘా వేశామని తెలిపారు. జిల్లాలోని నేలకొండపల్లి, మధిరలో నిర్మిస్తున్న ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే, ఖమ్మం కార్యాలయానికి కేటాయించిన స్థలంలో కొన్ని కారణాలతో పనులు చేపట్టలేదని వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా, వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం కార్యాలయంలో వేలం వేయగా, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.వేణుగోపాల్‌రెడ్డి, సీఐ ఆర్.విజేందర్, ఎస్సై శంకర్ పర్యవేక్షించారు. రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనం, ఒక కారును వేలం వేయగా రూ.2.60 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

ఆషామాషీగా తీసుకోవద్దు..

- 19, 20, 21వ తేదీల్లో గ్రామ కమిటీల సమావేశాలు
- సత్తుపల్లిఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: 'ఎన్నికల సమయం వచ్చేసింది.. నాలుగున్నరేళ్లు మీ కోసం కష్టపడ్డా.. నా కోసం రానున్న ఆరు నెలలు శ్రమించండి.. ఏ విషయాన్ని కూడా ఆషామాషీగా తీసుకోవద్దు..' అని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యర్థి పార్టీల నాయకులు చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు గ్రామాల వారీగా కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. అలాగే, గ్రామస్థాయిలో జరిగే రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు తనకు తెలిసేలా గ్రామాలు, జోన్ల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేయాలని తెలిపారు. కాగా, నియోజకవర్గంలో తాజా పరిస్థితులను తెలుసుకునేందుకు మండల పార్టీ అధ్యక్షులతో సహా స్థానిక ప్రజాప్రతినిధులు 19, 20, 21వ తేదీల్లో ఆయా మండలాల్లోని గ్రామాల్లో సభలు నిర్వహించాలని ఎమ్మెల్యే సండ్ర సూచించారు. మండలాన్ని రెండు నుంచి మూడు యూనిట్లుగా విభజించి.. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 15 నుంచి 17ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని చెప్పారు. తద్వారా నియోజకవర్గంలో 70వేల మంది నుంచి 80వేల మందిని ప్రత్యక్షంగా కలిసి చర్చించడం ద్వారా గ్రామ సమస్యలతో పాటు రాజకీయ మార్పులు, చేర్పులను వివరించొచ్చని తెలిపారు.

అన్నివర్గాలకు ప్రాధాన్యం

సత్తుపల్లి ఆత్మకమిటీ చైర్మన్‌గా ఆర్య వైశ్య సామాజికవర్గానికి చెందిన వనమా వాసును నియమించడంతో ఆ సామాజిక వర్గానికి బీఆర్‌ఎస్ ఇస్తున్న ప్రాధాన్యతపై ప్రచారం చేయాలని ఎమ్మెల్యే సండ్ర సూచించారు. కాగా, ఇన్నాళ్లు ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఉన్న శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి పార్టీ రాజకీయ అవసరాలకు ఉపయోగపడేలా పదవిని వదులుకోవడంపై అభినందించారు.

మార్కెట్‌లోకి సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్



వాహనాన్ని విడుదల చేస్తున్న ఆర్టీఓ కిషన్‌రావు, షోరూం యజమానులు

ఖమ్మంగాంధీచౌక్: హీరో మోటో కార్ప్ ఆధ్వర్యాన రూపొందించిన సూపర్ స్ప్లెండర్ ఎక్స్‌టెక్ వాహనం శనివారం ఖమ్మం మార్కెట్‌లోకి విడుదలైంది. ఈమేరకు నగరంలోని శ్రీశ్రీశ్రీ ఆటోమొబైల్స్ హీరో షోరూం ఆర్టీఓ కిషన్‌రావు వాహనాన్ని విడుదల చేశారు. కాగా, ఈ వాహనంలో 125 సీసీ ఇంజన్, ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్స్, డిజిటల్ స్పీడో మీటర్, బ్లూటూత్, యూఎస్‌బీ చార్జర్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూం యజమానులు ఈశ్వరప్రగడ హరిబాబు, రంగనాథ్, భార్గవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వర్షం



ఉపరితల ద్రోణి ప్రభావంతో శనివారం కూడా జిల్లాలోని పలు చోట్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాతావరణం చల్లబడడంతో ఇన్నాళ్లు ఎండవేడితో ఇబ్బంది పడిన ప్రజలు ఊరట చెందారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రాష్ట్రంలో పేదల ప్రభుత్వం

పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే సండ్ర



చెక్కులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారికి 58, 59 జీఓల ద్వారా పట్టాలు ఇవ్వడం ద్వారా.. పేదల ప్రభుత్వంగా నిలుస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. తల్లాడ రైతు వేదికలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో 25 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, 32 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావుతో కలిసి ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో నివసిస్తూ ఎలాంటి ఆధారం లేని వారికి పట్టాలు ఇస్తుండడంతో వారి కల నెరవేరుస్తోందని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడగా, కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, తహసీల్దార్ గంటా శ్రీలత, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, సర్పంచ్ పొట్టేటి సంధ్యారాణితో పాటు దుగ్గిదేవర వెంకట్‌లాల్, రాధిక, శ్రీనివాసరావు, కేతినేని చలపతి, దిరిశాల దాసురావు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, చల్లా తిరుమలాదేవి, కోటిరెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయ్?

300 ఎకరాలకు పైగా భూమిని గుర్తించిన రెవెన్యూ అధికారులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన స్థలాలు వివరాలు సేకరించాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు సుమారు 300 ఎకరాలకు పైగా భూమిని గుర్తించినట్లు తెలిసింది. గతంలో పేదలకు ఇళ్లస్థలాల కోసం సేకరించి పంపిణీ చేయగా, మిగిలిన పాట్లు, లబ్ధిదారులకు కేటాయించకుండా ఖాళీగా ఉన్న భూమి వివరాలు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఖమ్మం అర్బన్ మండలంలోని ధంసలాపురం, పాండురంగాపురంలో సుమారు 70కి పాట్లు(ఎకరం 20 కుంటలు), రఘునాథపాలెం మండలంలో సుమారు పది ఎకరాల పైగా భూమిని గుర్తించినట్లు తెలిసింది. ఇలా జిల్లాలో 300 ఎకరాలకు పైగానే గుర్తించగా, ఈ స్థలాలను సొంతిళ్లు లేని నిరుపేదలకు కేటాయించే ఆలోచనతో ప్రభుత్వం ఉందని సమాచారం.

రేపు దంత వైద్యశాలల్లో ఉచిత ఓపీ

ఖమ్మం వైద్యవిభాగం: వరల్డ్ ఓరల్ హెల్త్ డే పురస్కరించుకుని సోమవారం ఖమ్మంలోని అన్ని దంత వైద్యశాలల్లో ఉచితంగా ఓపీ సేవలు అందిస్తున్నట్లు ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.డీ.శ్రీనివాస్, ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. నోటి ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సాగర్ కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

బంధువు అంత్యక్రియలకు వెళ్లి స్నానం చేస్తుండగా ఘటన



మంగ్యా (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లికి చెందిన భూక్యా మంగ్యా(46) శనివారం సాగర్ కాల్వలో పడి గల్లంతయ్యాడు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దహన సంస్కారాలకు హాజరైన మంగ్యా, సమీపంలోని సాగర్ కాల్వలోకి స్నానం కోసం దిగాడు. అయితే, నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఆయన కొట్టుకుపోగా సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని గాలిస్తున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు ఆయన ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

యువతి మృతదేహం లభ్యం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం వద్ద సాగర్ కెనాల్‌లో శనివారం గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్సై స్రవంతి చేరుకుని ఆరా తీశారు. ఈనెల 5న కాల్వలో గల్లంతైన యువతి రూప(17) మృతదేహంగా భావిస్తున్నా నిర్ధారణ కాలేదు. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం గంగారానికి చెందిన కె.రూప మరికొందరితో కలిసి రాజేశ్వరపురంలో చెరుకు నరికేందుకు మూడు నెలల క్రితం రాగా, ఈనెల 5న రూప కాల్వలో గల్లంతైనట్లుగా తోటి కూలీలు చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు పది రోజుల పాటు గాలించినా ఆచూకీ తెలియలేదు. ఈమేరకు రెండు రోజుల క్రితమే ఆమె తల్లి స్వస్థలానికి వెళ్లగా శనివారం సాగర్ కాల్వలో నీరు తగ్గడంతో మృతదేహం బయటపడింది. అయితే, తల లేకపోవడంతో మృతదేహానికి ఉన్న దుస్తుల ఆధారంగా రూపదిగా చెబుతున్నా, కుటుంబ సభ్యులు వచ్చాక పోస్ట్‌మార్టం చేయిస్తే నిర్ధారణ అవుతుందని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...



సంద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు..

అల్లూరు: సముద్రం నీరు ఆకాశం తాగుతున్నట్లు ఉన్న సుడిగాలి రూపం నెల్లూరు తీర ప్రాంతంలో అబ్బురపరిచింది. ఈ టోర్నడో అల్లూరు మండలంలోని తాటిచెట్లపాలెం బీచ్‌లో కనిపించింది. ఆకాశంలో నిర్దిష్ట ప్రదేశంలో పీడనం ఏర్పడినపుడు సమీపంలోని సముద్రం నీటిని గాలి పైకి లాగడంతో ఆ దృశ్యం ఆవిష్కృతమైందని నిపుణులు చెబుతున్నారు.

భద్రాద్రి రాములోరి కల్యాణానికి చీరాల గోటి తలంబ్రాలు

చీరాల: భద్రాద్రి సీతారాముల కల్యాణ క్రతువులో వినియోగించే తలంబ్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. తలంబ్రాలలో వినియోగించే బియ్యాన్ని గోటితో ఒలిచి స్వామివారికి సమర్పించే అవకాశం క్షీరపురిగా పిలిచే చీరాల వాసులకు వరుసగా తొమ్మిదోసారి దక్కింది. ఈ మహాసంకల్పానికి చీరాలకు చెందిన సిద్ధాంతి పి.బాలకేశవులు, మరికొందరు పూనుకుని నియమనిష్టలతో నిర్వహిస్తున్నారు. చీరాలలో శ్రీ రఘురామ భక్తసేవా సమితి 2011లో 11మందితో ఏర్పాటైంది. వీరికి భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవానికి తలంబ్రాలు అందించే అవకాశం పూర్వజన్మ సుకృతంలా వచ్చింది. తలంబ్రాల కొరకు వడ్లను ఎంతో శ్రమంచి ఒలిచి, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో కలిపి.. నియమనిష్టలతో, శాస్త్రోక్తంగా తలంబ్రాలు చేస్తారు. విజయదశమి నుంచి ప్రారంభించి ఉగాది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 2015 అక్టోబర్ 23న చేపట్టిన ఈ మహా కార్యక్రమంలో.. ఏటా వందలాది భక్తులు పాల్గొంటున్నారు.

గేమ్ ఛేంజర్



పారిశ్రామికాభివృద్ధిలో జీఐఎస్ కీలక మలుపు

- రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 6.07 లక్షల మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి
- శాసన సభలో మంత్రులు, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు



సాక్షి, అమరావతి: రేపటి తరాల భవిష్యత్, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం పరితపిస్తున్న, శ్రమిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఏపీలో ఉన్న అపార వనరులను సరైన రీతిలో వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తున్నారని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'(ఏపీ జీఐఎస్)పై శాసనసభలో శనివారం స్వల్పకాలిక చర్చ నిర్వహించారు. ఈ చర్చలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆ సదస్సులో రూ.13,11,468 కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదిరాయన్నారు. ఈ క్రమంలో 6,07,383 మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిలో జీఐఎస్ గేమ్ చేంజర్ అని కొనియాడారు.

వ్యూహాత్మక విధానాలతో విజయం

'రాష్ట్ర ప్రభుత్వం సమ్మిట్ నిర్వహించడానికి ముందు రోడ్‌షోలు, వివిధ దేశాల దౌత్యవేత్తలతో సమావేశాలు, కర్టెన్‌రైజర్ కార్యక్రమాలు నిర్వహించాం. తద్వారా తీసుకున్న చర్యలు, వ్యూహాత్మక విధానాల ద్వారా విజయం సాధించాం. రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులతో 386 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. కొత్తగా పరిశ్రమలు నెలకొల్పే వారి కోసం వైఎస్సార్ వన్ కింద 23 శాఖలకు సంబంధించి 96 క్లియరెన్స్‌లు 21 రోజుల్లో ఇస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది ఏపీ ప్రభుత్వమే. రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో 48 వేల ఎకరాల భూమి పరిశ్రమలు నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం చేసిన ఏకైక ప్రభుత్వం కూడా మాదే. ఇదివరకెన్నడూ లేని విధంగా సీఎం జగన్ ఎంఎస్ఎంఈలకు రీస్టార్ట్, ఇతరత్రా చర్యలతో ప్రాధాన్యం ఇచ్చారు. తద్వారా 13 లక్షల మందికిపైగా ఉపాధి లభించింది. మూడేళ్లలో రూ.56 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో 111 భారీ పరిశ్రమలు తీసుకుచ్చాం. వీటిలో 73 వేల మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. మరో 88 పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి'అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. '2017లో చంద్రబాబు రూ.85,571 కోట్ల ఎంవోయూలు చేసుకుని 45,895 మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పినప్పటికీ ఎవరికీ ఉద్యోగాలు రాలేదు. 2018లో రూ.67,115 కోట్లతో ఎంవోయూలు చేసుకుంటే ఇందులో కూడా ఉద్యోగాలు జీరోనే'అని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



సీఎం జగన్‌తో ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: ఏపీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన నూతన ఎమ్మెల్సీలు మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో శనివారం నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నర్తు రామారావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, సిపాయి సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని సీఎం జగన్ అభినందించారు. శాసనమండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించిన సీఎంకు నూతన ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో ప్రాధాన్యత ఓటుతో గట్టెక్కిన టీడీపీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం/చిత్తూరు కలెక్టరేట్/సాక్షి, విశాఖపట్నం: తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండవ ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. నువ్వా నేనా అన్నట్టు సాగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి 7,543 ఓట్ల మెజారిటీతో గెలిచారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో మెజారిటీ రావడమే కాకుండా.. రెండో ప్రాధాన్యతలోనూ ఆధిక్యంలో కొనసాగిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చివరి రౌండులో ఓటమి పాలయ్యారు. చివరి రౌండులో పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజుకు వచ్చిన 19వేల పైచిలుకు ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సందర్భంగా టీడీపీకి మెజార్టీ వచ్చింది. బీజేపీ అభ్యర్థి నగనూరు రాఘవేంద్రకు వచ్చిన ఓట్లలోనూ రెండో ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా టీడీపీకి వచ్చాయి. కాగా, అనంతపురంలోని కౌంటింగ్ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకులు తిష్ట వేయడంతో తొలి నుంచి అనుమానాలు తలెత్తాయి. శుక్రవారం రాత్రి ఈ అనుమానాలు నిజమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చెందిన ఓట్లు కొన్ని తెలుగుదేశం పార్టీ కట్టల్లోకి వెళ్లినట్టు తేలింది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మొత్తం ఓట్లను రీకౌంటింగ్ చేయాలని పట్టుపట్టారు. కానీ ఆ బాక్స్ వరకు మాత్రమే లెక్కిస్తామని అధికారులు చెప్పారు. తూర్పు రాయలసీమలో, ఉత్తరాంధ్రలోనూ పీడీఎఫ్ ఓట్ల వల్లే టీడీపీ అభ్యర్థులు గట్టెక్కగలిగారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ (తూర్పు రాయలసీమ)గా టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థి వెంపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు.

అది అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కాదు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- నాలుగు కోట్ల ఓటర్లలో.. ఇప్పుడు ఓటు వేసింది ఎనిమిది లక్షలే



సాక్షి, అమరావతి: పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని ఏమాత్రం ప్రతిబింబించవంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి కొట్టిపారేశారు. ఏపీలోని నాలుగు కోట్ల మంది ఓటర్లలో మూడు పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని ఎనిమిది లక్షల మంది ఓటర్లు ఒక భాగం మాత్రమేనని స్పష్టం చేశారు. పట్టభద్ర ఎమ్మెల్సీ ఫలితాలతోనే తాము బలం పుంజుకున్నామని.. ఏదో జరిగిపోతుందని టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. శనివారం ఆయన వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మీడియా పాయింట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పీడీఎఫ్, వామపక్షాల ఓట్లతోనే..

'గతంలో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు, పీడీఎఫ్, ఉపాధ్యాయ సంఘాల యూనియన్‌లు, ఇతర యూనియన్‌లు పోటీ చేస్తే.. వాటికి రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ఈసారి మూడు పట్టభద్ర, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపాం. ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీని ఆదరించి, రెండు స్థానాల్లోనూ గెలిపించారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ఇదే ప్రథమం. పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి పీడీఎఫ్, వామపక్షాలు ఓట్లేయించడం వల్లే ఆ పార్టీ గెలిచింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎన్నికల ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ఓట్లు టీడీపీ అభ్యర్థి ఓట్లలో కలిపారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం'అని సజ్జల తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని స్పష్టంచేశారు. 2019 ఎన్నికల తర్వాత స్థానిక సంస్థలు.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు విజయాలు సాధించడం ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ఓటుకు కోట్లు తరహాలో బాబు కుట్ర

'శాసనసభలో టీడీపీకి సాంకేతికంగా 23 మంది సభ్యులు ఉన్నప్పటికీ.. అందులో నలుగురు ఆ పార్టీకి దూరంగా ఉన్నారు. సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానానికి టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించారు. గతంలో తెలంగాణలో సంఖ్యా బలం లేకపోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి.. నోట్ల కట్టలతో సంతలో పశువుల్లా ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఆడియో వీడియో టేపులతో చంద్రబాబు పట్టుబడ్డ విషయం అందరికీ తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే రీతిలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి చంద్రబాబు కుట్రలు చేయొచ్చు' అని సజ్జల పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయి

- పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి చెప్పారు. తనకు వచ్చిన ఓట్లను చాలావరకు టీడీపీ అభ్యర్థి ఖాతాలో కలిపారని, ఇందుకు కొందరు అధికారులు సహకరించారని తెలిపారు. మూడో రౌండు నుంచే తమకు కౌంటింగ్ ప్రక్రియపై అనుమానాలు వచ్చాయని చెప్పారు. ఈ అనుమానాలు 8వ రౌండులో ధృవపడ్డాయన్నారు. మొదటి రెండు రౌండ్లలో వెయ్యి వరకు మెజారిటీ వచ్చిందని, ఆ తర్వాత 20, 30కి పడిపోయిందని, ఎందుకిలా జరుగుతోందని అనుమానం వచ్చిందన్నారు. 8వ రౌండులో తనకు వచ్చిన ఓట్లలో ఆరింటిని టీడీపీ అభ్యర్థి బండిల్‌లో కట్టారని, ఇదే వ్యవహారం ముందు రౌండ్లలో కూడా జరిగి ఉంటుందని అన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని, న్యాయం చేయాలని రిటర్నింగ్ ఆఫీసర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

జిల్లా వార్తలు

క్రీడాకారిణికి నగదు బహుమతి



యజ్ఞతారెడ్డికి నగదు బహుమతి అందచేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: ప్రపంచ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మండలంలోని చొప్పకట్లపాలెంకు చెందిన యరమల యజ్ఞతారెడ్డికి శనివారం నాయకులు నగదు బహుమతి అందజేశారు. ఈమేరకు డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ శీలం కవిత, నాయకుడు డాక్టర్ కోటా రాంబాబు తదితరులు శనివారం యజ్ఞతారెడ్డి, ఆమె తల్లిదండ్రులు విజయనిర్మల-శ్రీనివాసరెడ్డిని సన్మానించి రూ.15వేల నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు శీలం వెంకట్రామిరెడ్డి, గూడూరు రమణారెడ్డి, రత్నాలరెడ్డి, పోతురాజు వెంకటేశ్వర్లు, కటికల సీతారాంరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, వెన్నపూస శ్రీనివాసరెడ్డి, బాబురావు, లింగారెడ్డి, మాధవ్‌రెడ్డి, రంగారెడ్డి, యర్రగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తితో పాటు రక్షణ కూడా ప్రధానమే..




బొగ్గు ఉత్పత్తి వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లిరూరల్: ఆర్థిక సంవత్సరం త్వరలో ముగియనున్న నేపథ్యాన నిర్దేశిత లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేస్తూనే రక్షణ చర్యలు పాటించాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలోని ఈపీసీ, సీహెచ్‌పీలను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సమీప ప్రాంత ప్రజలకు శబ్దం, కాలుష్యం ఎదురుకాకుండా ఓసీ హద్దుల వెంట మొక్కలు నాటాలని సూచించారు. అలాగే, సమంత సీహెచ్‌పీలో బొగ్గు దుమ్ము లేవకుండా చూడాలని, రోజుకు 46వేల టన్నుల బొగ్గును రవాణా చేయాలని తెలిపారు. ఏరియా జీఎం జక్కం రమేష్‌తో పాటు అధికారులు వై.రఘురామిరెడ్డి, వెంకటాచారి, శ్రీనివాస్, నర్సింహరావు, కృష్ణయ్య, రమణారెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

స్పీడ్‌పోస్టులో 'భద్రాద్రి' తలంబ్రాలు

- ఈనెల 28వ తేదీలోగా బుకింగ్‌కు అవకాశం
- అన్ని పోస్టాఫీసుల్లో మొదలైన బుకింగ్



ఖమ్మంగాంధీచౌక్: దక్షిణ అయోధ్యగా పేరున్న భద్రాచలంలో శ్రీరామనవమికి శ్రీసీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ కల్యాణోత్సవం సందర్భంగా శ్రీసీతారాములకు సమర్పించే కల్యాణ తలంబ్రాలకు భక్తులు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కానీ వివిధ కారణాలతో కల్యాణానికి హాజరుకాలేని భక్తులకు ఇంటివద్దే తలంబ్రాలు అందించేందుకు తపాలా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 30 తేదీన భద్రాచలంలో కల్యాణం జరగనుండగా, తలంబ్రాలను స్పీడ్ పోస్టు ద్వారా భక్తుల ఇంటి వద్దకు చేర్చే బాధ్యతను తపాలా శాఖ స్వీకరించింది. ఈమేరకు అంతరాలయ అర్చన కల్యాణ తలంబ్రాలు రూ.450, ముత్యాల తలంబ్రాల కోసం రూ.150 పోస్టాఫీసుల్లో చెల్లిస్తే భక్తులకు అందజేస్తారు. ఈ విషయమై భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అధికారులు, తపాలా శాఖ నడుమ ఒప్పందం కుదిరిన నేపథ్యాన ..ఆసక్తి ఉన్న భక్తులు ఈనెల 28వ తేదీలోగా బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఆర్టీసీ కార్గో ద్వారా కూడా తలంబ్రాల చేరవేత



ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను ఆర్టీసీ అధికారులు కార్గో ద్వారా భక్తులకు చేరవేయనున్నారు. ఈమేరకు రూ.116 చెల్లించి బుక్ చేసుకుంటే ఇంటి వద్దే తలంబ్రాలు అందచేస్తామని టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కార్గో ఖమ్మం, వరంగల్ జిల్లాల బాధ్యుడు వేణుగోపాల్, కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈమేరకు బుకింగ్ కోసం ఖమ్మం(91542 98583, 91542 98582, 87905 30478), మధిర(91542 98584), సత్తుపల్లి(91542 98585), కొత్తగూడెం(91542 98587, 91542 98599, 91542 98600), మణుగూరు(91542 98588), భద్రాచలం(91542 98586), పాల్వంచ(93473 40036), ఇల్లెందు(73969 12533), టేకులపల్లి(87907 26191), చంద్రుగొండ (85558 84637), ఏన్కూర్(90590 31523) నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి..



పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దే అందించాలని నిర్ణయించాం. పుణ్యక్షేత్రాన్ని సందర్శించలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– బి.రవికుమార్ సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

ఖమ్మం చేరిన 'భారత్ గౌరవ్' రైలు

యాత్రకు బయలుదేరిన 26 మంది



రైల్వే ఉద్యోగులు, సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మంమామిళ్లగూడెం: దేశ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పేలా ప్రవేశపెట్టిన భారత్ గౌరవ్ రైలు శనివారం ఖమ్మం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో యాత్రికులకు ఘన స్వాగతం పలికి రైలు సిబ్బంది, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌ను సన్మానించారు. ఖమ్మం నుంచి 26 మంది యాత్రికులు ఈ రైలులో పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యాన దేశంలోని తూర్పు, ఉత్తర భాగంలో అత్యంత పురాతనమైన, ముఖ్యమైన పుణ్యక్షేత్రాల సందర్శనకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈ రైలును ఏర్పాటుచేశారు. ఈ రైలులో పూరి, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ మీదుగా తొమ్మిది రోజులు పాటు పర్యటన కొనసాగుతుంది. కాగా, యాత్రికుల డిమాండ్ దృష్ట్యా వచ్చే నెల 18న మరో రైలు ఏర్పాటుచేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పీఆర్వో సీహెచ్.రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాఫర్, స్టేషన్ మాస్టర్ జీఎం వీ.ప్రసాద్, ఏడీఎన్ బి.సింగ్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా విస్తరణ పనులు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రామకృష్ణారెడ్డి

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమను ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ కల్యాణ్‌తో సమావేశమైన ఆయన పరిశ్రమ విస్తరణ పనులపై చర్చించారు. పనులు త్వరగా పూర్తి చేయించి, సీజన్ ప్రారంభం నాటికి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

వనరుల సేకరణకు ప్రాధాన్యత



లక్ష్యాలను సాధించిన పీఏసీఎస్ చైర్మన్లు కృష్ణయ్య, వెంకట్రావును సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, అధికారులు

- డిపాజిట్ల సేకరణను ప్రోత్సహిస్తేనే ఫలితాలు
- డీసీసీబీ మహాజన సభలో చైర్మన్ నాగభూషణం
- ఎరువుల ధరలు, నాణ్యతపై ప్రశ్నించిన సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ, పీఏసీఎస్‌ల ద్వారా వనరుల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం అన్నారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో 122వ మహాజన సభ జరగగా.. సభకు అధ్యక్షత వహించిన చైర్మన్ మాట్లాడుతూ నాబార్డ్ నిబంధనల ప్రకారం స్వల్పకాలిక రుణాల కోసం రాష్ట్ర సహకార బ్యాంక్ 70 శాతం సమకూరుస్తుండగా, మిగతా నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈమేరకు రైతుల పంట రుణాలకు ప్రాధాన్యం ఇస్తూనే డిపాజిట్ల సేకరణను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డీసీసీబీ పరిధిలోని 97 సహకార సంఘాలు ధాన్యం సేకరణలో రూ.645.25 కోట్ల వ్యాపారం చేసి రూ.10.45 కోట్ల కమీషన్ ఆర్జించాయని తెలిపారు. ఇక 98 సంఘాలు రూ. 82.60 కోట్ల మేర ఎరువుల వ్యాపారంతో రూ.0.81కోట్లు, 96 సంఘాలు రూ.31.01 కోట్ల విలువైన విత్తన వ్యాపారంతో రూ.0.25 కోట్ల కమీషన్ సాధించాయని చెప్పారు. అనంతరం సీఈఓ రానున్న ఆరు నెలల కాలానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, బ్యాంకు బైలా సవరణ, ఉద్యోగుల సర్వీసు నిబంధనల అమలుపై తీర్మానాలను ఆమోదించారు. కాగా, పలు పీఏసీఎస్‌ల అధ్యక్షులు మార్క్‌ఫెడ్ అందిస్తున్న ఎరువుల నాణ్యత, ధరలపై అభ్యంతరం చెప్పగా.. మార్క్‌ఫెడ్ డీఎం సునీత సమస్యను ప్రధాన కార్యాలయం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఇక అకాల వర్షాలతో జరిగిన పంట నష్టంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, బూర్గంపాడు పీఏసీఎస్ పరిధిలో 430 మంది రైతులు పోలవరం ప్రాజెక్టు కింద భూమి కోల్పోయినందున వారు బకాయి ఉన్న రూ. 1.50 కోట్ల రుణంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.

సంఘం లావాదేవీల ఆధారంగా గౌరవ వేతనం

ప్రభుత్వం, కో-ఆపరేటివ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం పీఏసీఎస్‌ల లావాదేవీల ఆధారంగా అధ్యక్షులకు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. రూ.5 కోట్ల లావాదేవీలు ఉంటే నెలకు రూ.5 వేలు, రూ.10 కోట్లు దాటితే రూ.7,500, రూ.15 కోట్ల లావాదేవీలకు రూ.10 వేలు, రూ.25 కోట్ల లావాదేవీలు కలిగిన సంఘాల అధ్యక్షులకు రూ.12,500లు, రూ.25 కోట్లు దాటిన సంఘాల అధ్యక్షులకు రూ.15 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లింపునకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే, వంద శాతం అప్పులు, రుణ వాయిదాలు వసూలు చేసిన సత్తుపల్లి, మంద్రాజుపల్లి పీఏసీఎస్‌ల అధ్యక్షులు చల్లగుళ్ల కృష్ణయ్య, తోట వెంకట్రావుతో పాటు డైరెక్టర్లుగా ఇటీవల ఎన్నికైన మోదుగు పుల్లారావు, నూకల సైదులును డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, డైరెక్టర్లు, అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాయల వెంకట శేషగిరిరావు, కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి విజయకుమారి, జిల్లా వ్యవసాయాధికారి యం విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.32.99 లక్షలు

పాల్వంచరూరల్: భద్రాద్రి కొత్తగూడెంజిల్లా పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. ఈమేరకు 110రోజులకు గాను రూ.32,99,472 ఆదాయం నమోదైందని దేవాదాయ శాఖ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజినీకుమారి తెలిపారు. అలాగే, విదేశీ నోట్లు, మిశ్రమ వెండి, బంగారం లభించాయని పేర్కొన్నారు. ఆలయ మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ పి.మదన్‌మోహన్, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం